భక్తిశ్రద్ధలతో మల్లన్న బోనాలు

చేవెళ్ల రూరల్, మే 19 : మండల పరిధిలోని ఇబ్రహీంపల్లిలో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మల్లన్న ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

అహింసా మార్గంలో నడువాలి

కొత్తూరు, మే19: ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడువాలని జడ్పీటీసీ శ్రీలత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లోని బుద్ధ ఆలయంలో డా. బాలు ఆధ్వర్యంలో ఆదివారం బుద్ధ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ శ్రీలత మాట్లాడుతూ.. బుద్ధుడు అనుసరించిన మార్గం ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్, ఎమ్మె సత్యనారాయణ, కౌన్సిలర్ కొస్గి శ్రీనివాసులు, బీజేపీ నాయకుడు అందె బాబయ్య పాల్గొన్నారు

విశ్వకర్మ సంఘం భవన నిర్మాణానికి విరాళం

విరాళం అందజేస్తున్న శ్రీశైలం

యాచారం, మే19: మండలంలోని మేడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విశ్వకర్మ సంఘం భవన నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ మోటె శ్రీశైలం రూ.20 వేల విరాళం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా తనవంతు సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నర్సింహ, శ్రీను, జంగయ్య, మల్లేశ్, రవి, సుందరయ్య, ప్రకాశ్‌చారి, శ్రీనివాస్‌చారి, బాలచారి, పరమేశ్‌చారి తదితరులున్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ..

యువజన సంఘం సభ్యులకు విరాళం అందజేస్తున్న అశోక్‌గౌడ్

షాద్‌నగర్‌టౌన్, మే 19 : షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంత్యాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేసినట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, మద్దూరి ఫౌండేషన్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు రూ. 10వేల విరాళాన్ని ఆదివారం యువజన సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్దూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విరాళం అందజేసిన అశోక్‌గౌడ్‌కు యువజన సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి జడ్పీటీసీ ఆర్థికసాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, మే 19 : మండల పరిధిలోని ముద్విన పంచాయతీలోని కోర్షకొండ తండాకు చెందిన సభావట్ సోమ్లానాయక్ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.5వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే సాలార్‌పూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన శిలారి ఇంటి నిర్మాణానికి జడ్పీటీసీ రూ.11వేల విలువ చేసే సిమెంట్ బస్తాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రెహ్మాన్, ఎంపీటీసీ ప్రియ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు వీరయ్య, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్య, మాజీ ఉప సర్పంచ్‌లు పాండు, వినోద్, నాయకులు రమేశ్‌నాయక్, కృష్ణ, పాండు, శ్రీను, గోపాల్, లక్ష్మయ్య, రాజు, వెంకటయ్య, దేవూ, వీరా, బిక్కు పాల్గొన్నారు

పేద విద్యార్థులను ప్రోత్సహిస్తాం

విద్యార్థులకు షూస్, టీషర్ట్స్ అందజేస్తున్న నందూ నాయక్

ఆర్కేపురం, మే 19 : పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో నందూ ఆర్మీ ఫిజికల్ అకాడమీ ఎప్పుడు ముందుంటుందని చైర్మన్ నందూనాయక్ అన్నారు. క్రీడాకారులకు అకాడమీ ఆధ్వర్యంలో షూస్, టీషర్ట్స్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నందూనాయక్ మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదనే ఆలోచనతో వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రతిభ ఉన్నా పేదరికంతో ఇబ్బంది పడే విద్యార్థుల వెన్నుతట్టి తమ వంతు సహాయం చేస్తూ అండగా నిలుస్తామన్నారు.

రైతు వేదికలు.. బహుళ ప్రయోజనాలు

- మండల పరిధిలో ఐదు వేదికలు
- రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్న అధికారులు

చేవెళ్లటౌన్, మే 19 : సాగులో సమస్యలు వస్తే రైతులు వ్యవసాయ అధికారులను కలువాలంటే ఒకప్పుడు మండల కేంద్రానికో, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమయాభావం, ఆర్థిక భారం రైతులపై అదనంగా పడేది. వ్యవసాయ అధికారులు సాగులో అధునాతన పద్ధతులు, యంత్రీకరణ, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి వేదిక దొరకడమే కష్టంగా ఉండేది. వీటిని గమనించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు వేదికలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గతంలో గ్రామ పంచాయతీ, రచ్చబండల వద్ద సభలు, సమావేశాలు నిర్వహించే వారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రైతు వేదికలో వ్యవసాయ అధికారి ఉండి రైతుల సమస్యలు పరిష్కరించేలా ఏర్పాటు చేశారు. ఒక్కో రైతు వేదిక పరిధిలో నాలుగు, ఏడు, ఎనిమిది పంచాయతీలు ఉండేలా క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. చేవెళ్ల మండల పరిధిలో చేవెళ్ల, కందవాడ, కమ్మెట, ఆలూర్, ఖానాపూర్ గ్రామాల్లో మొత్తం 5 రైతు వేదికలు నిర్మించారు. చేవెళ్ల రైతు వేదిక పరిధిలో 8 పంచాయతీలు, కందవాడ పరిధిలో 4, కమ్మెటలో 7, ఆలూరులో 8, ఖానాపూర్ రైతు వేదిక పరిధిలో 9 గ్రామాలు ఉండేలా క్లస్టర్లను ఏర్పాటు చేశారు. మండలంలోని రైతులకు ప్రతి వారంలో రెండు సార్లు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు పొలాల్లో క్షేత్ర పర్యటన చేసి రైతుకలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

రైతు వేదికలో రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఒక్కో రైతు వేదికలో ఒక వ్యవసాయ అధికారి ఉంటూ రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. వారానికోసారి రైతు వేదికలో సమావేశం నిర్వహించి పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో సూచిస్తున్నాం.

– తులసి, మండల వ్యవసాయ అధికారిణి, చేవెళ్ల

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఉపాధ్యాయుడి మృతి

మంచాల, మే 19 : బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ ఎక్స్‌రోడ్డు సమీపంలో ఆదివారం జరిగింది. ఎస్సై రవినాయక్ తెలిపిన వివరాలు.. యాచారం మండల పరిధిలోని నల్లవెల్లికి చెందిన శ్రీరాములు (40) ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆదివారం ఉదయం నల్లవెల్లి నుంచి బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్తుండగా అదే సమయంలో లోయపల్లి నుంచి లింగంపల్లి వైపు డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా లారీని నడుపుతూ ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టడంతో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మైసిగండి ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మైసమ్మతల్లి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

కడ్తాల్, మే 19 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మతల్లి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే సతీమణి మాధవి, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవితో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక నిధులను వెచ్చించి మైసమ్మతల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిత్తరంజన్ దాసు, జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, రాష్ట్ర నాయకురాలు ఇందిరాశోభన్, ఈవో స్నేహలత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, ఎల్లారెడ్డి, జంగయ్య, హన్మానాయక్, జహంగీర్‌అలీ, బీచ్చానాయక్, డాక్టర్ శ్రీనివాస్, కేఎన్ఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, ముత్తి కృష్ణ, శేఖర్‌గౌడ్, బిక్కునాయక్, రాజేందర్‌గౌడ్, ప్రభులింగం, శంకర్, సుమన్, మల్లేశ్, ఆలయ అర్చక సిబ్బంది యాదగిరి స్వామి, బోడియనాయక్, కృష్ణ, రాములు, చంద్రయ్య, దేవెందర్, వెంకటేశ్, శ్రీనివాస్, రమాదేవి, విజయ్, మహేశ్, రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

యాచారంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మొయినాబాద్ : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్
- పలు మండలాల్లో సుందరయ్య వర్ధంతి సందర్భంగా నివాళి

ఇబ్రహీంపట్నం : సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

యాచారం, మే19: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని డీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆయన పేదలకు చేసిన సేవలను స్మరిస్తూ జోహార్లు అర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు పాడారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ మాట్లాడుతూ... కుల వ్యవస్థకు నిరసనగా రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్న గొప్ప వ్యక్తి సుందరయ్య అన్నారు. పేదల కోసం సుందరయ్య నిరాడంబర జీవితాన్ని గడిపినట్లు తెలిపారు. పార్లమెంటు సభ్యుడిగా సుందరయ్య సుదీర్ఘ కాలంగా పనిచేసినట్లు గుర్తుచేశారు. పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లిన ఘనత సుందరయ్యదేనన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, జగన్, భూషణ్, అరుణ, తావునాయక్, వినోద్, గడ్డం కుమార్, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : దివంగత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సామెల్, సీహెచ్ జంగయ్య, ఎల్లేశ్, గణేశ్, నర్సింహ, జగన్, బుగ్గరాములు, లింగస్వామి, వెంకటేశ్, ముసలయ్య, ఆనంద్, విఘ్నేశ్, యాదగిరి, నర్సింహ, అయిలయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సుందరయ్యకు నివాళి

మొయినాబాద్: మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, భవన నిర్మాణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ను కబ్జా చేశారని ఆందోళన

కందుకూరు, మే 19 : రోడ్డును కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళన చేశారు. మండల పరిధిలోని నేదునూరు గ్రామ పరిధిలోని నల్లోంబాయి భూమిలో విద్యుత్ శాఖ సిబ్బంది దాదాపుగా 700ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. బాటను కూడా కబ్జా చేస్తూ గ్రామస్తులను వెళ్లనీయకుండా చేయడంతో వారు ఆందోళనకు దిగారు. తమ పంట పొలాలకు తండాకు వెళ్లాలంటే దారి లేదని బాటను కబ్జా చేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సర్వే చేసి హద్దులు చూపించే వరకు ఎలాంటి పనులు చేపట్టమని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సాయిబాబా కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

సాయిబాబా కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్బీనగర్ , మే 19: కొత్తపేట డివిజన్ సాయిబాబా కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం కొత్తపేట డివిజన్ శ్రీ సాయిబాబా కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ పవన్‌కుమార్ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ కాలనీలో తాగునీటి సమస్యలతో పాటుగా పాత డ్రైనేజీ పైప్‌లైన్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. స్పందించిన కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులతో మాట్లాడి తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి సురేశ్ యాదవ్, రాజశేఖర్, వెంకటయ్య గౌడ్, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రావు, అమర్‌తో పాటుగా పెద్ద సంఖ్యలో మహిళలలు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ విద్యార్థులకు తీపి కబురు

ఇబ్రహీంపట్నంరూరల్, మే 19 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఇబ్రహీంపట్నంలోని వాసవీ కళాశాల ఉచిత వసతిగృహంలో వసతి కల్పించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాదారం రమేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 7,0 జీపీఏ సాధించిన ప్రతి విద్యార్థి ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 6363 008585, 8333911999 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆమనగల్లు, మే 19 : ఆమనగల్లు పట్టణంతో పాటు ఇండస్ట్రీస్‌కు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్, 33 కేవీ ఫీడర్ లైన్లలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

సైదాబాద్, మే 19 : ప్రజలకు డ్రైనేజీ ఇబ్బందులు లేకుండా జలమండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల సూచించారు. అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని సపోటాబాగ్, మూమిడిరామయ్యనగర్ బస్తీల్లో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా బస్తీల్లో తరచూ డ్రైనేజీ ఇబ్బందులు వస్తున్నాయని స్థానికులు తన దృష్టికి తెచ్చారని, శాశ్వత పరిష్కారానికి జలమండలి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునీకరణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డ్రైనేజీ ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ మినాజుద్దీన్, అస్మాన్‌గడ్ జలమండలి డీజీఎం షీలారాణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

సీఎస్‌సీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామీణ బ్యాంక్ అధికారులు

కందుకూరు, మే 19 : బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాష్ట్ర సీఎస్‌సీ హెడ్ సునీల్ కుమార్ తెలిపారు. కొత్తగూడ బ్రాంచ్ నుంచి భరత్ కుమార్ అనే నిరుద్యోగికి సీఎస్‌సీ (కామన్ సర్వీసు సెంటర్)కింద 35శాతం సబ్సిడీ కింద రూ. 10లక్షలు రుణం మంజూరు చేశారు. ఆదివారం సీఎస్‌సీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కింద మాడల్ సీఎస్‌సీ కేంద్రాలకు రుణం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ సేవలను వినియోగించుకొని యువకులు ఆర్థికంగా ఎదగాలని కోరారు. 100 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి హరికృష్ణ, జిల్లా మేనేజర్ రాజేశ్వర్, కొత్తగూడ బ్రాంచ్ మేనేజరు లవ కుమార్, జిల్లా అధికారులు, బ్యాంక్ సిబ్బంది యువకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షపునీటి తరలింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్

హయత్‌నగర్, మే 19 : కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని ఆంధ్రకేసరి నగర్, కమలానగర్ తోపాటు పలు కాలనీల్లో రోడ్లపై నిలిచిన వర్షపునీటిని తొలగించేందుకు అధికారులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పై జాగ్రత్తగా ఉండాలన్నారు. హయత్‌నగర్ డివిజన్ అత్యవసర పరిస్థితుల్లో డీఆర్ఎఫ్ కంట్రోల్ రూమ్ నంబర్ 90001 13667, ఏఈ చంద్రశేఖర్ నంబర్ 73373 64225, వర్క్ ఇన్‌స్పెక్టర్ నంబర్ 99899 77533, విద్యుత్ అధికారి నంబర్ 94901 53577, 94901 53588, సీవరేజీ సూపర్‌వైజర్ నంబర్ 79894 63445 లలో సంప్రదించాలని కోరారు.